www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 జనవరి 2025
5
వైఎస్ఆర్

నేడు ప్రజా ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - కడప : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుండి 10.00 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రజలు 08562-2444 37 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అరటి అ'ధర'హో..

టన్ను ధర రూ.27 వేలు

విదేశాలలో పులివెందుల అరటికి డిమాండ్

సీజన్ ప్రారంభం కాకముందే మంచి ధర

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అరటి ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 15 రోజుల కిందట వరకు టన్ను అరటి రూ.14వేల నుంచి రూ.15వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ.25 వేల నుంచి రూ.27 వేలు పోతోంది. సీజన్ ప్రారంభం కాకముందే ఈ ధర ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గం అరటి సాగుకు పెట్టింది పేరు. ఇక్కడి లింగాల, పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, వేంపల్లె మండలాల్లో వివిధా అరటి సాగుచేశారు. దాదాపు 26 వేల ఎకరాల్లో ప్రస్తుతం సాగులో ఉంది. అరటి ఒక సీజన్ అని కాకుండా. ఎప్పుడు పడితే అప్పుడు సాగుచేస్తుంటారు. కానీ అధిక శాతం రైతులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్. ఈ మూడు మాసాల్లో పంట చేతికొచ్చేలా సాగుచేస్తారు. అరటి ధరలు కూడా ఈ మూడు నెలల్లో బాగా పెరుగుతాయి, చలి తగ్గుముఖం పట్టినప్పటి నుంచి మన దేశం లోని కలకత్తా, ఢిల్లీ, శ్రీనగర్, హర్యానా తది తర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. అలాగే అరబ్ దేశాలకు కూడా పులివెందుల అరటి ఎగుమతి అవుతోంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాలు మినహా మిగిలిన నెలల్లో అరటికి అంత ధర పలకదు. మిగిలిన మాసాల్లో రూ.14వేల నుంచి రూ.17వేల వరకు మాత్రమే ధర ఉంటుంది. కానీ ఈ ఏడాది డిసెంబరు 20 నుంచే ధరలు పెరగడం ప్రారంభమయ్యాయి. జనవరి మొదటి వారంలోనే నాణ్యమైన అరటి రూ.27 వేలు పలుకుతోంది. ఈ ధర ఉండటంతో ఆగకుండా ఇంకా పైపైకి పోతుందని అటు వ్యాపారులు, ఇటు రైతులు అంటున్నారు. రైతు పంట సాగుచేసిన ఏడాదికి వచ్చే మొదటి గెల, రెండో గెలకు ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. మొదటి గెలకు ప్రస్తుతం రూ.27 వేలు, రెండవ గెల రూ.20 వేల వరకు పలుకుతోంది.

అరబ్ దేశాలకు ఎగుమతి

ప్రస్తుతం పులివెందుల అరటి అరబ్ దేశాలకు, మన దేశంలోని శ్రీనగర్‌కు విరివిగా ఎగుమతి అవుతోంది. పులివెందుల అరటి మిగిలిన ప్రాంతాల్లో పండే అరటికి భిన్నంగా ఉంటుంది. ఇక్కడి రైతులు ఆధునిక సాంకేతికతను అంది పుచ్చుకుని సాగుచేస్తున్నారు. అందులోను ఈ ప్రాంత భూముల్లో పండే అరటి ఎక్కువ కాలం పాడవకుండా ఉంటుందని వ్యాపారులు, రైతులు అంటున్నారు. మిగిలిన ప్రాంతాల్లో పండే అరటి 8 నుంచి 10 రోజులు మాత్రమే ఉంటుందని, కానీ పులివెందుల అరటి 12 నుంచి 14 రోజుల నిల్వ ఉంటుందని అంటున్నారు. అందులోను పులివెందుల ప్రాంతంలో పంట పొలాలు అంత సారవంత మైనవి కాకపోవడం, కొంత చౌడు నేలలు కావడంతో ఇక్కడి అరటి నాణ్యత, రుచి కూడా ఎక్కువే అని రైతులు అంటున్నారు. అరబ్ దేశాలైన కువైట్, సౌదీ అరేబియా, ఒమన్ తది తర దేశాలకు పులివెందుల అరటి ఎక్కువగా ఎగుమతి అవుతోంది. అలాగే శ్రీనగర్‌కు కూడా అరటి ఎగుమతి జరుగుతుంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో మన దేశంలోని కశ్మీర్, ఢిల్లీ, కలకత్తా, హర్యానా తదితర రాష్ట్రాలకు ఎగుమతులు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభం కాకముందే అరటికి మంచి ధర రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరు ధరలు తగ్గ కుండా పెరిగితే కాసుల పంట పండినట్లేనని రైతులు అంటున్నారు. ఏప్రిల్, మే మాసాల్లో ఈదురుగాలులు వచ్చే అవకాశం ఉంది. ఆ సమయానికి పంట చేతికొచ్చేస్తుందని అంటున్నారు. నియోజకవర్గంలో గత ఏడాది అత్యధికంగా టన్ను రూ.29,500 పలికిందని ఈ ఏడాది అంతకంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొన్నారు.

లారీలో అరటి గెలలను ఎక్కిస్తున్న కూలీలు

ధరలుంటేనే రైతుకు లాభం

అరటి ధరలు ఇలాగానే ఉంటే రైతన్నకు ఎంతో లాభం వస్తుంది. టన్ను రూ. 20 వేలు తగ్గకుండా ఉంటే రైతన్నకు మంచి ఆదాయం. ప్రతి రైతు అరటిపంటపై ఆసక్తి చూపి విస్తీర్ణాన్ని పెంచే అవకాశం ఉంటుంది.

-పి. జయరామిరెడ్డి, రైతు లింగాల మండలం

ఇదే ధర ఉంటే మేలు..

సాగు తగ్గడం వల్లే ధరలు పెరిగాయి. మార్చి, ఏప్రిల్ మాసాలలో పంట అధికంగా వస్తుంది. 10 ఎకరాల్లో అరటిపంటను సాగుచేశాను. నాలుగు ఎకరాల్లో రెండో పంట చేతికి రావడానికి నెలరోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం ధర బాగా ఉంది. ఇదే ధర నెలరోజుల తర్వాత ఉంటే మాకు మేలు జరుగుతుంది.

-జి. మాధవ, రైతు, లింగాల మండలం

విస్తీర్ణం తగ్గడంతో ధరలు పెరిగాయి

విస్తీర్ణం తగ్గడం వల్ల ధరలు పెరగడానికి కారణం. అలాగే ఇక్కడ పండించే అరటికి ఇతర రాష్ట్రాలలోనూ దేశాలలోనూ మంచి గిరాకీ ఉంది దీనివల్ల డిమాండ్ పెరిగి ధరలు పెరగడానికి కారణం. వచ్చే నెలలో మరింత ధరలు పెరిగే అవకాశం ఉంది.

-దస్తగిరి, అరటి వ్యాపారి , పులివెందుల

కడప 'ఉక్కు'పై ఊసే ఎత్తని సిఎం

- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వాలు
- అభివృద్ధికి నిధులు కేటాయించాలి
- అమరావతితో పాటు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలి
- కడప ఉక్కు పై శంఖారావం
- సిపిఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి
- కడప జిల్లా సమగ్ర అభివృద్ధి సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్. బాబురావు

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్. బాబురావు

ప్రజాశక్తి - కడప అర్బన్

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని, కడప జిల్లా పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబు ఉక్కు పరిశ్రమ గురించి మాట్లాడకుండా వెళ్ళిపోవడం ఆయనకే చెల్లిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్ . బాబురావు పేర్కొన్నారు. ఆదివారం ఆర్.కె. నగర్ లోని సిపిఎం కార్యాలయంలో 27వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 'కడప జిల్లా సమగ్ర అభివృద్ధి-ప్రజా ప్రణాళిక' అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సిపిఎం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కొత్త ప్రాజెక్టు నిర్మిస్తామని సిఎంచంద్రబాబు నాయుడు చెప్పడం ప్రజలను మోసగించడమే అన్నారు. రైతు వ్యతిరేక మూడు చట్టాలు రద్దు, రైతు పోరాటాలు, ఎర్రజెండా వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు పోరాటాల్లో ముందు ఉంటారని తెలిపారు. సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళదామని పిలుపునిచ్చారు. కడపలో రాష్ట్ర విభజన హామీ మేరకు సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వల్ల 30 వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, అనుబంధ పరిశ్రమల వల్ల లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాజధాని అమరావతితో పాటు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సమయం ఇచ్చామని, అమలులో విఫలమైందని విమర్శించారు. గల్లా పెట్ట ఖాళీగా ఉందని ప్రభుత్వానికి ఇప్పుడు తెలిసిందా అని ప్రశ్నించారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలాలు ఇస్తామని చెబుతూనే, ఉన్నవి రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మోడీ, బాబు పాలనలో కార్పొరేట్లకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో ప్రజల మధ్య మత ద్వేషాలను రెచ్చగొట్టడం, ప్రజలను విభజించడం, మహిళల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. విద్యుత్ బిల్లుల మోత నాలుగు రకాలుగా ప్రజలపై వేస్తున్నారని చెప్పారు. ఇళ్లకు ఆదాని స్మార్ట్ మీటర్లు వస్తున్నాయని తెలిపారు. వీటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నెల్లూరులో నిర్వహించే సిపిఎం రాష్ట్ర మహాసభల్లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. కేంద్రాన్ని నిలదీస్తామని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్, అన్వేష్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి పోరాటాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వలసల నివారణకు పరిశ్రమల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. మైనింగ్ పరిశ్రమలు నెలకొల్పాలని చెప్పారు. అన్యాక్రాంతమైన భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ నిర్మించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబురావు

ప్రజాశక్తి - కడప అర్బన్

మీడియతో మాట్లాడుతున్న బాబురావు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించారని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాకే రాష్ట్రంలో పర్యటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేద్కర్ సర్కిల్‌లో 'గో బ్యాక్ అమిత్‌షా' అంటూ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానిస్తుంటే ఎపిలో పాలకపార్టీ కూటమి నేతలు, సిఎం చంద్రబాబు నాయుడు, నాయకులు అంబేద్కర్‌ను అవమానించిన వారిని పూలవర్షంతో స్వాగతం పలకడం సిగ్గుచేటన్నారు. అంబేద్కర్‌ను అవమానించడమంటే భారత జాతిని, రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. అంబ్కేదర్ పేరు ఉచ్చరిస్తే అమిత్‌షాకు, బిజెపికి ఎందుకు అంతవణుకు అని ప్రశ్నించారు. అంబ్కేర్ కాకుండా మోడీ నామస్మరణ చేయాలా అన్నారు. ఇంతజరుగుతున్నా మోడీ నోరువిప్పలేదని విమర్శించారు. జాతీమొత్తం క్షమాపణ చెప్పాలని కోరుతుందని, ఇంకోవైపు అమితి షాను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాల్సిన బాధ్యత మోడీపై ఉందన్నారు. కానీ ఆపని చేయడం లేదని పేర్కొన్నారు. ఎపిలో ఏముఖం పెట్టుకుని పర్యటిస్తున్నారని ప్రశ్నించారు. టిడిపి,బిజెపి, జనసేన కూటమి అంబేద్కర్‌ను అవమానించిన వారికి స్వాగతం పలుకుతున్నారో చూస్తున్నామని చెప్పారు. 125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలతో పెట్టానని, దళితబంధువునని చెప్పుకునే జగన్‌మోహన్‌రెడ్డి ఇంతవరకు నోరువిప్పలేదని తెలిపారు. వామపక్ష పార్టీలు కలసి అమిత్ షా గోబ్యాక్, బర్తరఫ్ చేయాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిఎం, డిప్యూటి సిఎం క్షమాపణ డిమాండ్ చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, సిపిఎం, సిపిఐ నగర కార్యదర్శులు రామమోహన్, వెంకటశివ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు రమణయ్య, ఆర్ఎస్‌పి నాయకులు సుబ్బరాయుడు, వామపక్ష ప్రజా సంఘాల నాయకులు మనోహర్, దస్తగిరిరెడ్డి, అన్వేష్, చంద్రారెడ్డి, శివకుమార్, శివనారాయణ, శివకుమార్, రవి, రాహుల్, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, బాదుల్లా, మద్దిలేటి, భాగ్యలక్ష్మి, నారాయణ, కుమారస్వామి, సిఆర్‌వి ప్రసాద్, రసూల్, శివశంకర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ విజేత కడప జట్టు

-నాలుగో స్థానంలో అన్నమయ్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తలపడుతున్న కడప, అనకాపల్లి జట్లు

14వ హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ ఫైనల్‌లో కడప జట్టు ప్రతిభ కనబర్చి ప్రత్యర్థి అనకాపల్లి జట్టు పై 3 -1 గోల్స్ తేడాతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. మదనపల్లె బిటి కళాశాల మైదానంలో నాలుగు రోజుల పాటు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలు నిర్వహించారు. ఆదివారం మూడు, నాలుగు స్థానాలకు జరిగిన పోటీలో తిరుపతి, అన్నమయ్య జట్లు పోటీ పడగా తిరుపతి జట్టు గెలుపొంది మూడో స్థానం దక్కించుకోగా, అన్నమయ్య జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. ఆ తరు వాత ఫైనల్ మ్యాచ్ లో కడప, అనకాపల్లి జట్లు తలపడగా అనకాపల్లి జిల్లా క్రీడాకారుడు మోహిత్ చరణ్1 గోల్ చేయగా, కడప జిల్లా క్రీడాకారుడు గంగా చైతన్య 53వ నిమిషంలో 1 గోల్ చేయడం తో స్కోర్ సమం అయ్యింది. ఆట ముగిసే సమయానికి ఇరుజట్లు 1-1 గోల్స్ తో సమానంగా ఉండడంతో షట్ అవుట్ (ట్రైప్ బ్రేక్)లో రెండు జట్లు తలపడగా కడప జిల్లా 2 గోల్స్ అనకాపల్లి జిల్లా ఒక గోల్ సాధించడంతో కడప జిల్లా జట్టు 3 గోల్స్‌తో విజయం సాధించింది. ఈ హాకీ పోటీల కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు జానకి రాజు, ట్రెజరర్ థామస్ పీటర్, ఆదిత్య విద్యాసంస్థల అధినేత రామలింగరెడ్డి పాల్గొని క్రీడాకారు లను పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన బహు మతి ప్రధానోత్సవంలో ఫైనల్ విజేత కడప జట్టుకు రామ లింగారెడ్డి, విద్యా సాగర్ మొమెంటోలు, మెడల్స్ అందించారు. రెండో స్థానంలో నిలిచిన అన కాపల్లి జట్టుకు రామ లింగారెడ్డి మొమెంటో అందించారు. మూడో స్థానం గెలుపొందిన తిరుపతి జట్టుకు హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చాణి క్యరాజు అం దించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ మనీని ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో హాకీ అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్, ప్రసా ద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు వివిధ జిల్లాల కోచ్ మేనేజర్లు, అంపైర్లు పాల్గొన్నారు.

సేఫ్టీ ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా పరిశ్రమల తనిఖీ అధికారి కె.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు సేఫ్టీ ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నిపుణుల, కార్మికుల ప్రాణాలకు ప్రమాదాలు సంభవించకుండా రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ చర్యల అనంతరం పారిశ్రామిక ఉత్పత్తిని చేపట్టాలి. పని ప్రదేశాల్లో హానికర మైన వాటిని తొలగించాలి. అనంతరం ఉపాధి పనులు కల్పించాలి. ఏతా వాతా చెప్పేదే మిటంటే సేఫ్టీ సంస్కృతిని అభివృద్ధి పర చాలి. ఈజ్ ఆఫ్ డూయి ంగ్ విధానంలో పరిశ్రమల తనిఖీ, దరఖా స్తుల పరిశీలన శీఘ్రగతిన చేపడుతున్నాం. ప్రతిఏటా డిసెంబర్ మాసం లో ఫ్యాక్టరీ లైసెన్స్ రెన్యువల్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొం టున్న డిస్ట్రిక్ట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌ఎసి) కె.కృష్ణమూర్తితో ముఖా ముఖి..

ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం గురించి తెలపండి?

ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం అంటే పరిశ్రమల తనిఖీలను సరళతరం, పారిశ్రామిక తనిఖీల్లో అధికారులు గుర్తించిన లోపాలను తెలియజేసి వాటిని సరిచేసుకోవడానికి అవకాశం ఇవ్వడం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేయడమే.

ఉభయ జిల్లాల్లోని పరిశ్రమల వివరాలపై స్పందించండి?

కడప, అన్నమయ్య జిల్లాల్లో 1,677 పరిశ్రమలున్నాయి. ఇందులో 312 పరిశ్రమల తొలగింపు జాబితాలో ఉన్నాయి. 2024 చివరి ఆర్నెళ్లలో ఎనిమిది కొత్త పరిశ్రమల ఏర్పాటుకు రిజిస్ట్రే షన్ చేసుకున్నవి.

పరిశ్రమల తనిఖీలపై మాట్లాడండి?

ఫ్యాక్టరీస్ ఆఫ్ రాష్ట్ర కమిషనరేట్ నుంచి వచ్చే చెక్‌లిస్ట్ ఆధారంగా తనిఖీలు చేపడతాం. చేసిన తనిఖీల వివరాలను కమిష నరేట్‌పై ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం. ఆర్నెళ్లు చిత్తూరు, తిరుపతి జిల్లాలు, మరో ఆర్నెళ్లు కడప, అన్నమయ్య జిల్లాల్లో తనిఖీలు చేపడతాం.

తనిఖీల్లో స్పెషల్‌డ్రైవ్స్ గురించి తెలపండి?

జిల్లాలోని పరిశ్రమల తనిఖీల్లో భాగంగా పరిశ్రమల యాజమాన్యాలకు, నిపుణులకు, కార్మికుల రక్షణ కోసం స్పెషల్‌డ్రైవ్స్ ఏర్పా టు చేస్తాం. వీటికి అదనంగా సేఫ్టీ కమిటీ మీటింగ్ నిర్వహిస్తాం. ఆర్నెళ్లకోసారి ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహిస్తాం. ఫలితంగా జిల్లాలోని 28 ప్రమాదకర పరిశ్రమల్లో రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చడం జరుగుతుంది.

జిల్లాలోని పారిశ్రామిక ప్రమాదాల గురించి చెప్పండి?

గత ఆర్నెళ్లుగా ఉభయ జిల్లాల్లోని పరిశ్రమల్లో ఐదుగురు మృతి చెందారు. వీరిలో నలుగురు పిల్లలు, ఒకటి ప్రమాదకర ఘటన చోటుచేసుకుంది. వీరికి రూ.73 లక్షల పరిహారం చెల్లించడమైంది.

పరిశ్రమల రెన్యువల్ ఫీజు లక్ష్యమెంత?

ఉభయ జిల్లాలో రూ.41,78,250 రెన్యువల్ ఫీజు చెల్లించాల్సి ఉంది. కానీ ఆచరణలో రూ.16,90,900 మాత్రమే వసూలు కావడం గమనార్హం. ప్రతి ఏటా డిసెంబర్ మాసంలో పరిశ్రమల రెన్యువల్ ఫీజులు చెల్లించాలని కోరుతున్న ఆశించిన స్పందన కని పించడం లేదు.

వెహికల్ బిల్లు వివరాలు తెలపండి?

గతంలో ప్రతి నెలా రూ.35 వేల చొప్పున చెల్లించేవారు. 2024 అక్టోబర్ నుంచి వెహికల్ బిల్లు రావడం లేదు. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉన్న నేపథ్యంలో తనిఖీల నిమిత్తం వెళ్లడా నికి సొంత ఖర్చులతో వెహికల్‌లో వెళ్లాల్సి వస్తోంది. వెళ్లకపోతే కమి షనరేట్ ఇచ్చిన టాస్క్‌ను సకాలంలో చేయలేం. తప్పదు మరి.

వేమన పద్యం సైద్ధాంతిక రత్నం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : సమాజంలోని మూఢవిశ్వాసాలను, కులమత భేదాలను, పేద, ధనిక అసమానతలను తూర్పారబట్టిన వేమన పద్యం సైద్ధాంతిక రత్నమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం వేమన జయంతి నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహితీచరిత్రలో వేమనది ఒక ప్రత్యేక అధ్యాయమని, అలతి అలతి పద్యాలతో సంఘసంస్కరణ దిశగా కవిత్వాన్ని అల్లిన ప్రజాకవి వేమనని అన్నారు. వేమన ఆశించిన నవసమాజం మన లక్ష్యం కావాలని పేర్కొన్నారు.

గత ప్రభుత్వంలో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు

- ఎపి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ విప్ మాధవిని, శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు

గత ప్రభుత్వంలో ఉద్యోగులు ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదు ర్కొన్నారని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్య నారాయణ పేర్కొన్నారు. కడపలో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం సమావేశం ఆదివారం జడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైనాన్షియల్ కోర్టులో నిబంధనలు ఉల్లంఘించి సిపిఎస్ ఉద్యోగుల సొమ్మును ఇతరత్రా వాటికి ఉపయోగించి అందరిని ఇబ్బందులు పెట్టారన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు వారి జీతాల నుంచి 10 శాతం కట్ చేసిందని వాపోయారు. జీతాలు, పెన్షన్లు ఒకటో తారీకు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మారిందన్నారు. గత్యంతరం లేక త ఆర్థికపరమైన చెల్లింపులు చేయాలని, చట్టబద్ధంగా చేయాలని నాటి గవర్నర్‌ను కలిశానని, నాయ కత్వం వహించానని తనపై, కుటుంబ సభ్యులపై కేసులు పెట్టి వేధించారన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఉద్యోగులను వేధించిందని పేర్కొన్నారు. వారికి రావాల్సిన అరియర్స్, జీతాలను సకాలంలో చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేసిందని చెప్పారు. . సంక్షేమ పథకాలు ప్రజల దరి చేరాలంటే ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన రఘురామ నాయుడును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ కుమార్, జిల్లా అధ్యక్షులు వి.రఘురామ నాయుడు, జిల్లా కార్యదర్శి జె.సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎం.కృష్ణ ప్రసాద్, జిల్లా ట్రెజరర్ జీ.వి.చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు మురళి, జిల్లా సహాయధ్యక్షులు డాక్టర్ వెంకట చంద్ర రెడ్డి, నగర అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి సతీష్, కార్యవర్గ సభ్యులు, ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విష్ణు వందన కుటుంబానికి కలెక్టర్ భరోసా

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు) : మైదుకూరుకు చెందిన విష్ణు వందన కుటుంబానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను 24 గంటల్లోపే తీర్చేందుకు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులతో కలిసి తక్షణ చర్యలు చేపట్టారు. శనివారం మైదుకూరు మున్సిపాలిటీకి విచ్చేసిన ముఖ్యమంత్రి వినాయ కనగర్‌లో నివాసముంటున్న వేల్తుర్ల విష్ణు వందన నివాసాన్ని సందర్శించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేసి చెత్త ద్వారా సంపదను సృష్టించవచ్చు అనే ప్రభుత్వ సూచనలు పాటిస్తున్న ఆమెను అభి నందించారు. ఈ సందర్భంగా కుటుంబ జీవనం మెరుగు కోసం, కుటుం బాన్ని ఆర్థికంగా బలోపేతం సాయం చేయాలని సిఎంను వినతి పత్రం ద్వారా కోరారు. స్పందించిన సిఎం విష్ణు వందన కుటుంబానికి సాయం అందిం చాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు ఆదివారం కలెక్టర్, జెసి కలిసి విష్ణు వందన నివాసానికి వెళ్లారు. కుటుంబంలో ఒకరికి వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తూ అనుమతి పత్రం ఇచ్చారు. ఉపాధి కోసం వెల్డింగ్ మిషన్ కోసం మెప్మా ద్వారా సుబ్బరాయుడు అనే వ్యక్తికి ఆర్థిక సాయం చేశారు. కుటుంబంలో అర్హతను బట్టి ఒకరికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇంకా రెండుకాళ్లు లేని మహిళకు ఆరోగ్యశ్రీద్వారా వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు.

పింఛను మంజూరు అనుమతి పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

కడప 'ఉక్కు' సంగతేమిటి? : పిసిసి

ప్రజాశక్తి - కడప

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్. తులసిరెడ్డి

విశాఖ ఉక్కు సంగతి సరే. మరి కడప ఉక్కు సంగతేమిటనీ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలను ప్రశ్నిం చారు. ఆదివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో 13 వ షెడ్యూలు ప్రకారం విభజన జరిగిన 6 నెలల లోపల సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఉందని చెప్పారు. పదేళ్ల తరువాత అయినా అతీగతీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సి.కె. దిన్నె, జమ్మలమడుగు, మైలవరం ˇ అనేక మండలాల్లో అవసరమైన భూమి ఉందని, నీటికి సంబంధించి గండికోట, మైలవరం, బ్రహ్మ సాగర్, సోమశిల జలాశయాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఆర్‌టిపిపి, రవాణాకు సంబంధించి రోడ్డు, రైలు, విమాన, జల రవాణా సౌకర్యాలున్నాయని పేర్కొన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని వుంది అన్నట్లుంది కడప జిల్లా నిరుద్యోగుల పరిస్థితి ఆయన పేర్కొన్నారు. .బిజెపి మోసగారితనం, ప్రాంతీయ పార్టీల చేతగా నితనం దీనికి కారణం అన్నారు. 2018లో ఎన్నికలకు ముందు మైలవరం మండలం, కంబాల దీన్నే గ్రామం వద్ద రాయల సీమ స్టీల్స్ లిమిటెడ్ పేరుతో అప్పట్లో ముఖ్య మంత్రి హోదాలో చంద్ర బాబు ఉక్కు కర్మాగారానికి శంఖు స్థాపన చేశారు, 3,892 ఎకరాలు కేటాయించారు .కానీ పైసా పనికూడా జరగలేదు అన్నారు. మళ్ళీ అధికారంలోకి వచ్చి 7 నెలలయింది. ఉక్కు ఊసే లేదు అన్నారు. కడప జిల్లా అంటే అంత చులకనా భావమా? నిర్లక్ష్యమా? అని ప్రశ్నించారు. ఇలాగే ప్రవర్తిస్తే రాబోవు ఎన్నికల్లో టిడిపి కూటమి కి జిల్లాలో ఒక సీటు కూడా రాదని తులసి రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కడప అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త బండి జకరయ్య,సత్తార్,ప్రసాద్ గౌడ్,రఫీక్, శ్యామలమ్మ, నాగరత్నం, మైనుద్దీన్, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగ రాజు, రమణ, వినయ్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

మాట్లాడుతున్న శివార్జున

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపా ధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఆదివారం ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు అయినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా 2022 నుంచి సరెండర్ లీవ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి స్పందించి పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను మంజూరు చేయాలని, 30శాతం ఐఆర్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసి, ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు చింత గింజల సుదర్శన్ బాబు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఎలు, ఐఆర్, పెండింగ్‌లో ఉన్న బకాయిల కొరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేండ్రగుత్తి గంగరాజు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి. శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు సి.సుదర్శన్ బాబు, జిల్లా కార్యదర్శి కట్ట గంగాధర్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, అధికారులు

కనీస వసతులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని కాంపల్లెలో నిర్మించిన ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీలో కనీస వసతులకు సంబంధించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం కాంపల్లెలో హౌసింగ్ పీడీ రాజారత్నంతో కలిసి ఆయన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 2016-17లో ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీ పేరుతో 42 ఇళ్ల మంజూరయ్యాయని తెలిపారు. అప్పట్లో ఇంటి నిర్మాణాలు చాలావరకు పూర్తి కాలేదన్నారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ కాలనీ పట్ల నిర్లక్ష్యంతో నేటికీ లబ్ధిదారులు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. కాలనీలో డ్రయినేజీ, తాగునీటికి సంబంధించి పనులను పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీ నియోజవర్గంలోనే ఓ మోడల్‌గా తీర్చిదిద్దడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రమణారెడ్డి, ఎఇ వాసుదేవరెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యుత్ కార్మికులకు తెలుగుదేశం ప్రభుత్వం ఎల్లప్పటికీ అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు మద్దూరు వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తెలుగునాడు విద్యుత్ కార్మికుల సంఘం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లేటి రామిరెడ్డి, డివిజనల్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, దామోదర్‌తోపాటు సభ్యులు కలిసి తెలుగునాడు విద్యుత్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని విత్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. డివిజన్‌లో యూనియన్ బలోపేతానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెడ్డి కమ్యూనిటీ నాయకులు

విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మహాకవి యోగి వేమారెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం రెడ్డి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముద్దనూరురోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ రెడ్డి నాయకులు హాలు గంగాధరరెడ్డి, విశిష్టఅతిథిగా హాజరైన విశ్రాంత డిగ్రీ కళాశాల అధ్యాపకులు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం రెడ్డివెల్ఫేర్ సొసైటీ సహకారంతో 30 మంది విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు వేమన కీర్తి తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. వేమారెడ్డి విగ్రహాన్ని పులివెందులలో ఒక ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసి, భావితరాలకు ఆయన గొప్పతనాన్ని, నీతిపద్యాలను తెలియ జేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, హిందూ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎన్ఆర్‌వి ప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు యడుగూరి శ్రీనివాసరెడ్డి, రెడ్డి వెల్ఫేర్ సొసైటీ పులివెందుల నాయకులు చప్పిడి కృష్ణారెడ్డి, రామాపురం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్థానాన్ని మళ్లీ కైవసం చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

ఒబిసి ఓటు మనదే.. సీటు మనదే అనే నినాదంతో రాబోయే ఎన్నికల్లో జమ్మలమడుగులో మళ్లీ బిసిలు ఎమ్మెల్యే స్థానాన్ని కైవసం చేసుకోవాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నాగుల కట్టలోని శ్రీదేవిశ్రీ ఫంక్షన్ హాల్‌లో బిసి సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ జమ్మలమడుగు అధ్యక్షులు జోల్లు కొండయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీల్లో బిసిలకు రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. 75ఏళ్ల గడిచినా సామాజిక సమానత కనబడడం లేదన్నారు. జ్యోతి బాపూలే సామాజిక స్ఫూర్తితో, అంబేద్కర్ రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా చూడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బిసిలకు కుల జనగణన జరపాలని కోరారు. బిసిలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్లో పాస్ అయ్యేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో మహిళా సబ్ కోటా ఇవ్వాలన్నారు. జమ్మలమడుగు తొలి ఎమ్మెల్యే శ్రీకృష్ణుల కుండా రామయ్య ఆదర్శంతో రాబోయే ఎన్నికల్లో బిసిలు చైతన్యవంతులై పోగొట్టుకున్న ఎమ్మెల్యే స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కేశవ శంకర్‌రావు మాట్లాడుతూ బిసిల గడ్డ జమ్మలమడుగు గడ్డ అని తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం వడ్డెర సంఘం, నాయి బ్రాహ్మణ సంఘం, 20 బిసి కుల సంఘాల నేతలు, బిసి సంక్షేమ సంఘం జిల్లా జిల్లా అధ్యక్షులు లింగమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి కాటా రామదాసు, ప్రధాన కార్యదర్శి మేడికుర్తి జీవన్ కుమార్, ఉపాధ్యక్షులు అంబవరం రామయ్య పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONORABLE JUNIOR CIVIL JUDGE, KAMALAPURAM
E.P.No.36/2023, L.A.C No.449 of 2022
O.S.No.125/2017

Buchupalli Narendra Reddy, Son of Pedda Subba Reddy, aged about 52 years, Hindu, Employee in ICL.,Chilamakuru Village, residing at Chilamakuru Village, Yerraguntla Mandal, Kadapa District.

Vs.

Bogireddy Peddi Reddy, Son of Eswara Reddy, aged about 47 years, Hindu, working as CCR Operator, Bharathi Cements Limited, Nallalingayapalli Village, Kamalapuram Mandal, Kadapa District, residing at Karchukuntapalli Village, Yerraguntla Mandal, Kadapa District. J.Dr

NOTICE

పై నెంబరు దావాలోని J.Dr అయిన నీకు దావా నోటీసు తీసుకొనుటకు రాజశ్రీ కోర్టు వారు ఉత్తర్వు చేసివున్నారు. అట్టి ఉత్తర్వు మేరకు నీవు గాని నీ వకీలు ద్వారా గాని రాజశ్రీ కోర్టు యెదుట హాజరు ఆగుటకు 27-01-2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసివున్నారు. నీకు ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలసినది. లేని యెడల రాజశ్రీ కోర్టు వారు నిన్ను పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ : 27-01-2025

B. NARAYANA REDDY.
Advocate, Kamalapuram

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, AMALAPURAM.
O.S. No. 96/2024

Andhra Pragathi Grameena Bank, Represented by its Branch Manager, V.N. Palli Branch, V.N. Palli Mandal, Kadapa District. ...Plaintiff

Vs.

Kodadala Siva Lakshumma, W/o. P. Chenna Reddy, Hindu, aged about 58 years, Agriculture & Business, residing at Mittapalli Village, V.N. Palli Mandal, Kadapa District, having died her legal representative daughter i.e. 1st defendant.
1. Kona Leelavathamma, W/o. K. Madhava Reddy, Hindu, aged about 44 years, Agriculture & Business, residing at D.No. 3/1211, Co-operative Colony, Kadapa City & District.
2. Gajjala Chandra Mohan Reddy, S/o. G. Rama Chandra Reddy, Hindu, aged about 44 years, Agriculture & Business, residing at Mittapalli Village, V.N. Palli Mandal, Kadapa District. .
....Defendants

NOTICE TO DEFENDANT No.1

Please take notice that the Hon'ble Court has ordered for notice to the defendant No.1 to appear on 24-01-2025 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.

//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/- B. SYAM SUNDER,
Advocate for plaintiff, KADAPA

ధర బాగున్నా.. దిగుబడి లేదన్నా..!

నువ్వు పంటకు నల్లమచ్చ తెగుళ్లు-ఆందోళనలో రైతులు-ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - వేంపల్లె

నువ్వు పంటకు నల్లమచ్చ తెగుళ్లు సోకింది. దీంతో పంట సాగు చేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వేంపల్లె మండలంలోని పాములూరు, అమ్మగారిపల్లె, రామిరెడ్డిపల్లి, తాళ్ళపల్లె, కుమ్మరాంపల్లె, అలిరెడ్డిపల్లి, అలవలపాడు అయ్యవారిపల్లి, వేంపల్లె, నందిపల్లె, కత్తులూరు, టి.వెలమవారిపల్లెతోపాటు ఆయా గ్రామాల్లో 400 ఎకరాల్లో రైతులు నూగు పంటను సాగు చేశారు. నూగు పంట మంచి దిగుబడి వస్తుందనే ఆశతో రైతులు రబీలో మినుము, శనగ పంటతోపాటు నూగు పంటను కూడా విపరీతంగా సాగు చేశారు. అయితే రైతులు సాగు చేసిన నూగు పంటకు వాతావరణం పరిస్థితుల కారణంగా నల్లమచ్చ తెగుళ్ల సోకడంతో పంట పూర్తిగా నల్లగా మారి పోయింది. ఆకులు నల్లగా మాడి పోయి పుల్లగా కనబడుతోంది. నల్లమచ్చ తెగుళ్లతో పూర్తిగా దిగుబడి తగ్గి పోయిందని రైతులు అంటున్నారు. పంటకు దాదాపు రూ.10 వేలు ఖర్చు చేసి సాగు చేసినప్పటికీ తెగుళ్లతో పంట దెబ్బతిందని రైతులు పేర్కొంటున్నారు. ఎలాంటి తెగుళ్ల లేకుండా పంట బాగా పండితే ఎకరాకు 3,4 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, ప్రస్తుతం దిగుబడి అంతంత మాత్రంగానే ఉందని రైతులు అంటున్నారు. నువ్వులకు ధర కూడా బాగా ఉందన్నారు. తెగుళ్లతో పంట రాలేదని రైతులు వాపోతున్నారు. రైతులు అనుకున్న దిగుబడి రాదని అంటున్నారు.

తెగుళ్ల సోకడంతో నల్లగా మారిన నువ్వు పంట

విత్తనాలు మొలకెత్తే సమయంలో, పూత దశలో, కోత దశలో నువ్వులకు పలు రకాల తెగుళ్ల సోకుతాయని రైతులు వివరించారు. నల్లమచ్చ తెగుళ్లతో మొక్కల ఆకులు, కొమ్మలు, కాండం వంటి భాగాలపై మొక్కల రసాన్ని పీల్చి వేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా మొక్కలు క్షీణించడంతోపాటు ఆకులు ముడుచుకుపోయి రాలిపోతాయని తెలిపారు. మొక్కలు బలహీనపడి ఎదుగుదల ఆగిపోయినట్లు చెప్పారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని నువ్వు రైతులు కోరుతున్నారు.

వైసిపి బలోపేతానికి కృషి చేస్తాం

నూతనంగా ఎంపికైన నాయకులను సత్కరిస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైసిపి బలోపేతానికి కృషి చేస్తామని నూతనంగా ఎంపికైన ఆ పార్టీ మండల నాయకులు, జిల్లా కార్యవర్గ నాయకులు పేర్కొన్నారు. స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం నూర్ బాషా రాష్ట్ర అధ్యక్షులు ఓతూరు రసూల్ ఆధ్వర్యంలో వైసిపి పులివెందుల నియోజకవర్గ మండల కన్వీనర్‌లకు, పట్టణ కన్వీనర్‌లకు జిల్లా స్థాయి పదవులు పొందిన పార్టీ నాయకులకు ఘనంగా సన్మానం చేశారు. నూతనంగా ఎంపికైన పులివెందుల పార్టీ మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, లింగాల మండలశాఖ అధ్యక్షులు బాబురెడ్డి, వేముల మండల అధ్యక్షులుగా సాంబశివారెడ్డి, తొండూరు మండల అధ్యక్షులుగా రవీంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్లుగా హాల్ గంగాధరరెడ్డి, హఫీజ్, జిల్లాస్థాయి పదవులు పొందిన పుష్పనాథ రెడ్డి, నూరుల్లా, కొల్ల భాస్కర్‌ను శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్ప, జెసిఎస్ కన్వీనర్లు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, సీనియర్ నాయకులు ఏర్వా వెంకట సుబ్బయ్య, నాయకులు గూడూరి గురుప్రసాద్, బాబయ్య, కో-ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, ఎస్‌సి నాయకులు కృష్ణమూర్తి, నాగరాజు, చలపతి, సోపాల వీరా, సర్వోత్తమరెడ్డి, వైసిపి యూత్ నవీన్, కిరణ్ పాల్గొన్నారు.

వేమన మాటలు వెలకట్టలేని మూటలు

వేమన విగ్రహం వద్ద సమితి సభ్యులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వేమన మాటలు వెలకట్టలేనివని వేమన సేవా సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. సమితి ఆధ్వర్యంలో ఆదివారం వేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం నుండి టిబి రోడ్డు, రాజీవ్‌సర్కిల్ మీదుగా బివిఎస్ థియేటర్ ఎదురుగా ఉన్న వేమన విగ్రహం వరకు శోభాయాత్ర చేశారు. వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శివాలయంలోని కాలక్షేప మండపంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగదస్తగిరిరెడ్డి మాట్లాడుతూ వేమన సంఘంలోని అవినీతిని తన పదునైన ఉపమానాలతో ఎండగట్టారన్నారు. వేమన సాహిత్యం నేటితరం పిల్లలు నేర్చుకొని భావాన్ని గ్రహించి పాటించాలన్నారు. ఎంఇఒ సావిత్రమ్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు సమితి వారు నిర్వహించే పోటీలు సహకరిస్తాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత చదువులబాబు, సమితి అధ్యక్షులు మురికూటి సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన పద్యపఠనం, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలో విజేతలైన వారికి నగదు, సర్టిఫికేట్, వేమన శతకం జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ టిడి వరుణ్‌కుమార్‌రెడ్డి, శివాలయం ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** విశ్వానికి ఒక వెలుగు చూపిన కవి, ప్రపంచానికి తన పద్యాల ద్వారా ఒక దారి చూపిన మహనీయుడు యోగి వేమారెడ్డి అని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారుపల్లె జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం మహిళ అధ్యక్షురాలు సానంరెడ్డి సుహాసిని రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పొన్నపురెడ్డి శకుంతలరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమారెడ్డి జయంతి సందర్భంగా స్థానిక వేమారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఉప మండలాధ్యక్షులు ఆసం దస్తగిరిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వీరపునాయునిపల్లె మండల అధ్యక్షులు వేమ నారాయణరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం సభ్యులు బొమ్ము లక్ష్మి పుల్లారెడ్డి, అమ్మిరెడ్డి రమణారెడ్డి(చిన్న), నారుపల్లె లక్ష్మీనారాయణ రెడ్డి, అమ్మిరెడ్డి చిన్న అంకిరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **వేంపల్లె :** వేమన మహాకవి, మహాయోగి, గొప్ప సంఘ సంస్కర్త అని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో కలిసి తులసిరెడ్డి వేమన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలు సార్వజనీనం, సర్వకాలీనం, సర్వ ప్రాంతీయమని కొనియాడారు. సమాజంలోని మూఢాచారాలు, అరాచకాలను, అకృత్యాలను, అన్యాయాలను, డాబుదర్పాలను తన కవితా ఖడ్గంతో చీల్చి చెండాడని వివరించారు. వేమన అచ్చమైన తెలుగు సహజ చాటు కవి అన్నారు. స్థానిక సామెతలు, లోకోక్తులు, జాతీయాలు ఆటవెలది రూపంలో నాట్యం చేస్తాయని అన్నారు. మత, కుల రాజకీయాలు విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వేమన పద్యాలు, సూక్తులు, ప్రబోధాలు సమాజానికి ఎంతో అవసరమని తులసిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, అమర్, రాజు, ఐచర్ రమణ, ఉత్తన్న, వినయ్ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కుష్టువ్యాధి రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలని వైఎంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు పిలుపునిచ్చారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం సోమవారం నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ సుబ్బారెడ్డి, ఫార్మాసిస్ట్ దినేష్, స్టాఫ్ నర్సులు విజయశాంతి, రాజకుమారి పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని జమ్మలమడుగు అధ్యక్షులు వీరబ్రహ్మాచారి స్వామి తెలిపారు. ఆదివారం నాగులకట్ట వద్ద ఆయన మాట్లాడుతూ రైతులకు పరికరాలను, మహిళలకు ఆభరణాలు, గృహ సంబంధ పరికరాలను తయారు చేస్తూ సమాజం ముందుకు నడవడంలో కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. విశ్వబ్రాహ్మణ వారిని గుర్తించి వారి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ ఆచారి, రమణయ్య ఆచారి, లక్షుమయ్య ఆచారి, వీర నారాయణ ఆచారి పాల్గొన్నారు.

జంప్‌రోప్ పోటీల్లో జెష్మికి బంగారు పతకం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీలో మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సి.జెష్మి గోల్డ్ మెడల్ సాధించింది. నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీలో బ్రాంజ్ మెడల్, మహారాష్ట్ర నాందేడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలో గోల్డ్ మెడల్ సాధించింది. ఇండో నేపాల్ జంపురోప్ ఛాంపియన్ షిప్-2025 పోటీలకు ఎంపికైంది. ఈనెల 5 నుండి 9 వరకు నేపాల్ దేశంలో జరిగిన జంప్‌రోప్ పోటీల్లో వివిధ దేశాలతో పోటీపడి అండర్-14 బాలికల సైక్లింగ్ విభా గంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించిన సి.జెష్మిని తల్లి దండ్రులు చిన్న సుబ్బరాయుడు, జాస్లీన్, బాలికల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఎస్ఎపిఇ పుష్పలత, తెలుగు ఉపాధ్యాయుడు కొండారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ హాకీలో సత్తా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ హాకీలో బి.అరవింద్ మొదటి స్థానం సాధించాడు. ఈ నెల 17 నుండి 19 వరకు మూడు రోజులు పాటు మదనపల్లిలో హాకీ అసోషియేషన్ అధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ సత్యనియర్స్ విభాగంలో సింహాద్రిపురం మండలం బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 9వ తరగతి చదువుచున్న బి.అరవింద్ కడప జిల్లా జట్టులో అత్యంత ప్రతిభ కనబరచి, మొదటి స్థానం సాధించాడు. తన ఈ విజయం పట్ల పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రామాం జనేయులు, రిటైర్డ్ పిఇటి రేణుకా దేవి ప్రోత్సాహం మరువలేదని విద్యార్థి పేర్కొన్నారు. విద్యార్థి విజయం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాసు, బోధన, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

హాకీలో విజేతగా నిలచిన అరవింద్

CHANGE OF NAME & DOB

I, P. LAKSHUMMA, is the Mother of Army No.16114346M, RANK: HAV, P. MALLIKARJUNA REDDY, R/o D.No.15-145, Gunturukottalu Village, Mydukur Mandal, Kadapa District, A.P-516172 That in the service record of my son my Name wrongly entered as P.LAKSHUMMA instead of POKALA LAKSHUMMA and my DOB wrongly entered as 01.07.1963 instead of 01.01.1946 vide Affidavit Attested by Notary, Mydukur(Govt of AP, India) Please Correct it

CHANGE OF NAME & DOB

I, P.MALLESWAR REDDY, is the Father of Army No.16114346M, RANK:HAV, P.MALLIKARJUNA REDDY, R/o D.No.15-145, Gunturukottalu Village, Mydukur Mandal, Kadapa District, A.P-516172 That in the service record of my son my Name wrongly entered as P.MALLESWAR REDDY instead of POKALA MALLESWAR REDDY and my DOB wrongly entered as 01.07.1959 instead of 01.01.1942 vide Affidavit Attested by Notary, Mydukur(Govt of AP, India) Please Correct it

నువ్వు పంటను పరిశీలిస్తున్న ఎఒ శివమోహన్ రెడ్డి

నువ్వుల పంటను పరిశీలించిన ఎఒ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని రావులకొలను గ్రామంలో గడ్డి మందు కారణంగా ఎదుగుదలలేని నువ్వుల పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి శివమోహన్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. 'ఎదుగుదలలేని నువ్వు పంట' అనే శీర్షికన 'ప్రజాశక్తి'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. ఇందుకు సంబంధిత అధికారులు స్పందించారు. రైతు మహేశ్వర్‌రెడ్డి పొలంలో సాగు చేసిన నువ్వు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ పంట ఎదుగుదల లేని విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. ఉన్నతాధికారుల సూచన మేరకు శాస్త్రవేత్తలను పిలిపించి ల్యాబ్‌కు పంపిస్తామని ఎఒ తెలిపారు.

15 ఎకరాల్లో నష్టం : పులివెందులలోని గురు బాలాజీ రైతు డిపోలో విత్తనాలు, గడ్డి మందులు కొనుగోలు చేసి వినియోగించానని బాధిత రైతు మహేశ్వరెడ్డి విలేకరుల ఎదుట వాపోయాడు. తాను 15 ఎకరాల్లో పంట సాగు చేశానని తెలిపారు. పంట పూర్తిగా ఎదుగుదల లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు తనకు న్యాయం చేయాలని రైతు కోరాడు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకుడు విశ్వనాథ్

కెవిఆర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని కెవిఆర్ మల్టి స్పెషాలిటీ ఆస్పత్రిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ కెవిఆర్ ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యంతో శనివారం ఒకరు మృతి చెందారని, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారన్నారు. ఈ ఆస్పత్రిలో నిత్యం రోగులు ఏదో సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కెవిఆర్ హాస్పిటల్‌పై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు, ఆందోళనలు జరుగుతున్నా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా వైద్య శాఖాధికారులు రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించి సంబంధిత హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో చిన్న, రమణయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో సోమవారం నుండి పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. 20న సోమవారం బద్రిపల్లి, 21న చిన్నగురవలూరు, 22న చెంచుపల్లి, 23న గాంధీనగర్, 25న ఖాదర్‌పల్లి, 27న మొర్రాయపల్లి, 28న నరహరిపురం, 29న ద్వారకానగరం, 30న వెదురూరు, 31న అన్నవరం గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పశువైద్య శిబిరాల్లో తేలికపాటి శస్త్ర చికిత్సలు, ఎదకురాని పశువులకు గర్భకోశ సంబంధమైన పరీక్షలు, నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు వేస్తామన్నారు. పాడి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న కొమ్ము నాగేశ్వరరావు

ఐక్యంగా మన హక్కులను సాధించుకుందాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఐక్యంగా మన హక్కులను సాధించుకుందామని సమన్వయకర్త కొమ్ము నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం పులివెందుల అసెంబ్లీ పరిధిలోని వివిధ మండలాల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, కార్యవర్గ సభ్యులు, మాదిగ ఉద్యోగుల సమాఖ్య, మహజన సోషలిస్ట్ పార్టీ కార్యకర్తలు సమావేశమయ్యారు. కొమ్ము నాగేశ్వరరావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాదు నగరంలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరపతలపెట్టిన 1000 గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమానికి పులివెందుల నియోజకవర్గం నుండి తప్పెట కళాకారులతోపాటు ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళితవాది జెసి రామాంజనేయులు, పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాలె గంగరాజు మాట్లాడారు. సాకే చరణ్ కుమార్ మాదిగ, లింగాల రమేష్ మాదిగ, ఉత్తయ్య మాదిగ, రామచంద్రుడు మాదిగ, రామాంజనేయులు మాదిగ, రమేష్ మాదిగ, బాబు మాదిగ, ఓబులేష్ మాదిగ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చిన్నగురువళూరు గ్రామానికి చెందిన నలుగురు రోడ్డుప్రమాద బాధితులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల చిన్నగురువలూరుకు చెందిన యువకులు ఎర్రమాచు రాజేష్ రెడ్డి, కె.శివానందరెడ్డి, పి.శ్రీధర్రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్సలో భాగంగా ఇంటి వద్ద ఉన్న వీరిని మాజీ ఎమ్మెల్యే పరామర్శించి, వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామం లోని పలువురి ఇళ్లకు వెళ్లి పలకరించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్షుమయ్య, వివేకానంద స్కూల్ కరస్పాండెంటు నాగేశ్వర్‌రెడ్డి, అల్లాడుపల్లె సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, శివారెడ్డి, రాజారెడ్డి, చంద్రఓబుళరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.